బాలికలను వేధిస్తే కటకటాల్లోకే..

- పాఠశాలల్లో ఫిర్యాదు బాక్స్‌ల ఏర్పాటు
- 15 రోజులకు ఒకసారి ఎంఈఓ పర్యవేక్షణలో పరిశీలన
- రక్షణ చట్టాలపై విస్తృత స్థాయిలో అవగాహన



టోల్ ఫ్రీ నంబర్లపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

గుమ్మఘట్ట: బాలికలకు అన్యాయం జరిగినప్పుడు ఎవరికి చెప్పుకోలేని నిస్సహాయ స్థితిలో ఉంటారు. బయటకు చెబితే సమాజంలో చెడ్డపేరు వస్తుందేమోనని భయపడి మానసిక క్షోభకు గురవుతుంటారు. ఇకపై ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేసింది. ఎవరైనా ఏడిపించినా, మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తే కటకటాలు లెక్కించడం తథ్యం. బాలికలు ఫిర్యాదును పెట్టెలో వేస్తే చాలు.. ఉపాధ్యాయులు, ఎంఈఓ పరిశీలించి, చర్యలు తీసుకుంటారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా.. వేధింపులకు గురిచేసినా ఎవరికి తెలియకుండా ఫిర్యాదు రాసుకుని బాక్స్‌లో వేస్తే పరిశీలించిన అధికారులు పోలీసులకు సమాచారం అందించి ఆకతాయిల భరతం పడతారు. ఆపద ఎదురైనప్పుడు ఎలా గట్టెక్కాలి? ఎవరికి ఎలా చెప్పాలి? ఎలా తెలియజేయాలి? అనే అంశాలపై పాఠశాలల వద్ద ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేశారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల వ్యాప్తంగా 806 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా.. ఇందులో 1,11,989 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యం

కొన్ని సమస్యలను విద్యార్థినిలు బయటకు చెప్పుకోలేరు. యాదృచ్ఛికంగా జరిగిన ఘటనను లెటర్ రూపంలో రాసి ఫిర్యాదు బాక్సులో వేయాలి. 15 రోజులకు ఒకసారి బాక్సులను ఎంఈఓ, మహిళా పోలీసుల పర్యవేక్షణలో ఓపెన్ చేసి అందులోని ఫిర్యాదులను పరిశీలిస్తారు. సమస్య తీవ్రతను బట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారు. ఫిర్యాదు చేసి వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.

వేధింపులపై అవగాహన

బాలికలకు వేధింపులు, బ్యాడ్ టచ్, గుడ్‌టచ్ వంటి అంశాలపై వాల్‌పోస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక పోస్టర్లలో వేధింపులు ఎలా గుర్తించాలి. ఏ విధంగా స్పందించాలి. అనే అంశాలను కూలంకుషంగా పొందుపరచారు. ఆపత్కాలంలో ఎవరికి ఫిర్యాదు చేయాలో స్పష్టంగా పేర్కొనడంతో పాటు ఫోన్ నంబర్లను ముద్రించారు.

హెచ్‌ఎంల గది వద్ద బాక్సుల ఏర్పాటు

ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎం గది వద్ద విద్యార్థులకు కనిపించేలా ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేశారు. వీటికి అయ్యే ఖర్చును పాఠశాల అభివద్ధి నిధుల నుంచి తీసుకునేలా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. వేధింపులకు గురిచేసినా, శరీరంపై చేయి వేసినా, బాల్య వివాహాలను ప్రేరేపిస్తున్నా 1098కు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పిస్తున్నారు. బాలిక రక్షణకు 100, మహిళల భద్రత కోసం దిశా యాప్ 112, అత్యవసర సేవలకు 108, ఉమెన్ హెల్ప్‌లైన్ సేవలకు 181 నంబర్లకు ఫోన్ చేయాలని చైతన్యం తీసుకువస్తున్నారు.

రక్షణ చర్యలు బాగున్నాయి



బాలికల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి మాలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయడం భేష్. కొన్ని సమయాల్లో సమస్యలను ఉపాధ్యాయులకు చెప్పే సాహసం చేయలేం. మాలాంటి బాలికలకు రక్షణగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టడం శుభపరిణామం.

– అర్చన, 10వ తరగతి, ఎంజేబీ పాఠశాల, గుమ్మఘట్ట

సమస్యలు లెటర్‌లో రాయాలి



విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఫిర్యాదుల బాక్సులను ఓపెన్ చేసి చూస్తాం. ఫిర్యాదుల బట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. బాలికల రక్షణకు అండగా నిలుస్తాం. వారి శ్రేయస్సుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తాం.

– శ్రీదేవి, ప్రిన్సిపాల్, ఎంజేబీ పాఠశాల, గుమ్మఘట్ట

బాలికల రక్షణకు చర్యలు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు అర్థమయ్యేరీతిలో తగిన బోర్డులను ఏర్పాటు చేశాం. ఈ విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించి, చైతన్యం తీసుకువస్తున్నాం. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. బాలికల రక్షణకు అండగా నిలుస్తాం.

– ఎం.సాయిరాం, జిల్లా విద్యాధికారి, అనంతపురం

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఆర్‌డీఓ రవీంద్ర, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ చిట్టెమ్మ

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని ఆర్‌డీఓ రవీంద్ర ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 24 నుంచి మార్చి 2 వరకూ జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భద్రతపై గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ.. మార్చి 1వ తేదీన జరిగే బ్రహ్మరథోత్సవానికి తరలివచ్చే భక్తులకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా భక్తులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడమే కాకుండా ఎండ తీవ్రత దృష్ట్యా చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 150 మంది ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల ఎలాంటి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదన్నారు. సహాయ కమిషనర్ చిట్టెమ్మ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల్లో లంకాదహనం సందర్భంగా పరిమిత సంఖ్యలో బాణాసంచాను అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ గురుమూర్తి, ఎంపీడీఓ చంద్రమౌళి, ఈఓఆర్‌డీ దామోదర్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటస్వామి, ఆర్‌అండ్‌బీ జేఈ కావ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫామీదా, అగ్నిమాపక శాఖ అధికారి భీమలింగ, ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సాహితి, విద్యుత్ శాఖ ఏఈ గురుమూర్తి, ఈఓ గౌస్‌సాహెబ్ పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ పెద్దన్న

బొమ్మనహాళ్/బెళుగుప్ప: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, పండ్లతోటలు, వైద్యం, ఉపాధి హామీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ తప్పక చేయించుకోవాలని ఏఓ పృథ్వీసాగర్ సూచించారు. హౌసింగ్ శాఖలో సచివాలయ ఇంజినీర్ల అలసత్వంతో చాలా వరకూ ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు పడకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఏఈ శివారెడ్డిని సభ్యులు నిలదీశారు. సచివాలయాల్లో అధికారులు సమయపాలన లేకుండా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపించారు. అనవసరంగా మెడికల్ లీవ్‌పై వెళ్తూ విధులకు రాకుండా ఉన్న వారిపై మండల అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అధికారులు కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్పావతి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, బెళుగుప్ప, ఆవులెన్న సహకార సంఘాల అధ్యక్షులు శివలింగప్ప, శ్రీనివాసులు, మండల అగ్రీబోర్డు అధ్యక్షుడు శ్రీనివాస్, తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఎంపీడీఓ యాదవేంద్ర, ఎస్‌ఐ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

పనుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా

కూడేరు: ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనుల కల్పనపై మండల సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కూలీలకు పనులు కల్పించడంలో మండలం వెనుకబడి ఉందన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్ మేరకు రోజుకు 3 వేల మందికి పని కల్పించాలని ఆదేశించారు. పనుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, ఇంజినీర్ రవి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కణేకల్లు: జాబ్ కార్డు పొందిన ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ పనులకు వచ్చేలా చూడాలని ఏపీఓ తిరుపాల్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. రోజూ 3,500 మంది కూలీలు రావాల్సి ఉండగా కేవలం సగం మంది రావడం బాధాకరమన్నారు. జాబ్ కార్డు ఉండి పనులకు రాకపోతే అలాంటి వారి జాబ్‌కార్డు రద్దవుతుందనే విషయాన్ని కూలీలకు చెప్పాలని టీఏలను ఆదేశించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సహకారంతో ఈ విషయాన్ని ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. గ్రామాల్లో 2022 సంవత్సరానికి మిగిలి ఉన్న పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పవిత్ర

డి హీరేహాళ్ (రాయదుర్గం): వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలత్తెకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీపీ పవిత్ర ఆదేశాలు జారీ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా చేపట్టిన పురోగతి, అభివృద్ధిపై అధికారులు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా రూ.41 కోట్ల నిధుల మంజూరుకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక కృషి చేశారన్నారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావడంతో త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు రూ.2.25 కోట్లు మంజూరు కాగా, పలు గ్రామాల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణానికి రూ.4.40 కోట్ల నిధులు విడుదలయ్యాయన్నారు. ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావాలని హౌసింగ్ ఏఈ సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జెడ్పీటీసీ హసీనబాను, రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్ నాయక్, మండల కన్వీనర్ వన్నూర్‌స్వామి, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి ఎంపీడీఓ భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

కూడేరు: పీఏబీఆర్ డ్యాం వద్ద ఉన్న సీపీడబ్ల్యూఎస్ పథకం కూడేరు ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికుడు రాజేష్ తండ్రి బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, ఆయన తనయుడు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రణయ్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

ఉరవకొండ: స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలో బుధవారం మినరల్ వాటర్ చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు పీజీఎస్ మాహబు ఆధ్వర్యంలో అబ్దుల్ రహిమాన్ చేతుల మీదుగా ప్రారంభించారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సుంకుల పార్వతీ దేవి రథోత్సవం రేపు

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో ఈనెల 24వ తేదీన సుంకుల పార్వతీ దేవి రథోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 23న జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉచ్చాయం , 24న సాయంత్రం సుంకుల పార్వతీ దేవి ప్రతిమ ఊరేగింపు, రథోత్సవం నిర్వహిస్తామన్నారు.

క్రీడాకారులకు అభినందన

శెట్టూరు: జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులకు బుధవారం మండల పరిధిలోని కనుకూరు ఉన్నత పాఠశాలలో అభినంద సభ ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ యువరాజ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఫిరోజ్‌ఖాన్, పీడీ అమారాంజినేయులు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కిష్టప్ప పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు రేపు

కూడేరు: స్థానిక శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 24న ఉదయం 11 గంటలకు హుండీ కానులను లెక్కించనున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.బాబు బుధవారం తెలిపారు.

డిగ్రీ కళాశాలలో శ్రమదానం

కళ్యాణదుర్గం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం చేసినట్లు ప్రోగ్రాం ఆఫీసర్లు కాంతరావు, శశికుమార్ తెలిపారు. స్థానిక ఇండోర్ స్టేడియం ముందుభాగంలో పిచ్చి మొక్కలు తొలగించినట్లు పేర్కొన్నారు. త్వరలో విద్యార్థులు భోజనం చేసేందుకు, చదువుకునేందుకు వీలుగా ఖాళీ స్థలంలో సిమెంటు బెంచీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిద్దాం

కళ్యాణదుర్గం: స్థానిక వివేకానంద కళాశాలలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు సీమకృష్ణ, గోపాల్, నాగభూషణ, సంతోష్ మాట్లాడారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు కడితే రాయలసీమ ఎడారిగా మారుతుందన్నారు. రాయలసీమలో సాగు, తాగునీరు కూడా ఉండవన్నారు. పార్టీలకు అతీతంగా కలిసి వచ్చి అప్పర్ భద్రను వ్యతిరేకిద్దామని పిలుపునిచ్చారు.

వైద్యుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం



వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణి

వజ్రకరూరు: మండల పరిధిలోని గడేహోతురులో బుధవారం సాయంత్రం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారుల పని తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నహోతురు గ్రామానికి చెందిన వెన్నెల అనే గర్భిణి అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే గడేహోతురు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే అక్కడ స్టాఫ్ నర్సు గౌరితో పాటు మరొకరు కిందిస్థాయి సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఈ సమయంలో వైద్యులు లేకపోవడంతో గర్భవతి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న సర్పంచు సురేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు పరమేష్ తదితరులు ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం వారు వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రిగా మార్చినా అందుబాటులో లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇలాగైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. అనంతరం వైద్యులు పద్మ, మారుతి తదితరులు ఆసుపత్రికి చేరుకుని గర్భిణికి వైద్య పరీక్షలు చేశారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



సూచనలిస్తున్న గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర

వజ్రకరూరు: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను సందర్శించారు. అనంత సంకల్పం కార్యక్రమంపై ఆరా తీశారు. త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, హెచ్‌ఎం నాగేంద్రప్ప, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వో సుబ్బారావు, సీఓ నరేష్, సచివాలయ సర్వేయర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసతులపై ఆరా తీస్తున్న అధికారులు

ఉరవకొండ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉరవకొండలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను ఆర్‌డీఓ రవీంద్ర, తహసీల్దార్ షాబుద్దీన్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఒక పోలింగ్ కేంద్రం, పట్టభద్రులకు సంబంధించి రెండు పోలింగ్ కేంద్రాలను ఆర్‌డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఎర్పాటు చేయడంతో పాటు కేంద్రంలో ఫ్యాన్లు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు సౌకర్యాలు కల్పించాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 5,377 ఉండగా.. ఉపాధ్యాయ ఓటర్లు 287 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు.

రేపటి నుంచి గుడిబండ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

కుందుర్పి: వడ్డెపాళ్యం గుడిబండ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 24వ తేదీన ప్రారంభంకానున్నాయి. శుక్రవారం కుంకుమార్చన, మణెవె ఉత్సవం, శనివారం గంగపూజ సందర్భంగా కర్ణాటక పరశురాంపురం వేదావతి నది వద్దకు గ్రామోత్సవంగా తీసుకెళ్తారు. అదే రోజు గొరవయ్యల నృత్య ప్రదర్శన, కీలుగుర్రాల ప్రదర్శన, పౌరాణిక వేషధారణతో భక్తులను అలరిస్తారు. ఆదివారం ఉదయం 7 గంటలకు హోమం 9 గంటలకు బ్రహ్మరథోత్సవం సందర్భంగా రథాన్ని భక్తుల సహాయంతో ఊరేగిస్తారు. అదే సమయంలో బెంగళూరుకు చెందిన ఓ భక్తుడు హెలికాప్టర్ ద్వారా రథంపై పూల వర్షం కురిపిస్తారని ఆలయ కమిటీ పేర్కొంది. సోమవారం నిర్వహించే రాతిదూలం లాగుడు పోటీల్లో విజేత వృషభాలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ నగదు బహుమతులు అందజేయనున్నారు.

హెలిప్యాడ్ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కుందుర్పి: గుడిబండ ఆంజనేయస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం రథంపై హెలికాప్టర్ ద్వారా పూలు చల్లేందుకు బెంగళూరుకు చెందిన ఓ భక్తుడు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈనెల 26న ఉదయం 8 గంటలకే హెలికాప్టర్ వడ్డెపాళ్యం గ్రామానికి చేరుకుంటున్న తరుణంలో బుధవారం తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ నారాయణ స్వామి, సర్పంచ్ గోవిందమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరాయుడు తదితరులు హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.

విధుల నుంచి ప్లంబర్ తొలగింపు

రాయదుర్గం: నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ప్లంబర్‌గా విధుల్లో చేరిన మహేష్‌ను డీసీహెచ్‌ఎస్ ఆదేశాలతో తొలగించామని ఆస్పత్రి సూపరింటెంట్ మాధవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో సీనియర్ వైద్యాధికారి ఉమమహేశ్వర్‌తో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వైద్య సేవలను ప్రభుత్వం పేదలకు అందిస్తోందన్నారు. ఆస్పత్రిలో ఇప్పటికే ట్యూబెక్టమీ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. త్వరలోనే రక్తశుద్ధి కేంద్రం కూడా తెరువబోతున్నామన్నారు. రూ.17 కోట్లతో చేపట్టిన నూతన భవనాలు కూడా త్వరితగతిన పూర్తవుతాయని పేర్కొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

వజ్రకరూరు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్డీటీ ఏటీఎల్ వరకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక ఆర్డీటీ పాఠశాలలో శ్రీచరిత మండల మహిళా సమాఖ్య ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించాలన్నారు. మహిళల సంరక్షణకు ప్రవేశపెట్టిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎస్టీఎల్ హుసేన్‌బీ, వీఆర్వో అరుణ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

రాయదుర్గం రూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఈనెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.కొండయ్య తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, మండల ప్రాదేశిక సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

కళ్యాణదుర్గంలో క్షుద్రపూజల కలకలం



ఇంటి ముందు క్షుద్రపూజలు చేసిన దృశ్యం

కళ్యాణదుర్గం: పట్టణంలోని సిద్దప్ప వంక వీధిలో దొణస్వామి అనే వ్యక్తికి చెందిన ఇంటి ముందు క్షుద్రపూజలు కలకలం రేపాయి. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొణస్వామి నివాసం ఉంటున్న ఇంటి ముందు కోడిగుడ్లు, పూలు, పసుపు, కుంకుమ తదితర వస్తువులతో క్షుద్ర పూజలు చేశారు. విషయం తెలుసుకున్న దొణస్వామి తాను నిర్మిస్తున్న నూతన ఇంటి వద్ద నుంచి పాత ఇంటి వద్దకు చేరుకున్నాడు. అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేస్తున్నట్లు గమనించాడు. అయితే ప్రశ్నించేందుకు వెళ్తుండగా తనపై దాడికి యత్నించేందుకు ప్రయత్నించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు బాధితుడు వాపోయాడు. అనంతరం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తకు గాయాలు



తీవ్రంగా గాయపడిన రేణుకమ్మ

కూడేరు: మండల పరిధిలోని ముద్దలాపురం వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాలు.. ఆత్మకూరు మండలం గొరిదిండ్లకు చెందిన అంజనప్ప, రేణుకమ్మ భార్యాభర్తలు. ఉరవకొండలో చదువుతున్న కూతురు రూపను చూసి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. ముద్దలాపురం వద్దకు చేరుకోగానే.. బెంగళూరు నుంచి బళ్లారి వెళుతున్న ఇన్నోవా కారు అదుపు తప్పి ఎదురుగా వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో రేణుకమ్మ ఎడమ కాలి బొటన వేలు పూర్తిగా తెగిపోయింది. అంజనప్ప కూడా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో అనంతపురంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సీసీ రోడ్డు ధ్వంసం



జేసీబీతో రోడ్డును ధ్వంసం చేస్తున్న దృశ్యం

రాయదుర్గం రూరల్: ప్రజోపయోగార్థం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఆరేళ్ల క్రితం వేసిన సిమెంట్ రోడ్డును అదే గ్రామానికి చెందిన వ్యక్తి ధ్వంసం చేయించిన ఘటన మండలంలోని చదం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. సర్పంచ్ వెంకటేశులు తెలిపిన వివరాలు.. తన స్థలంలో సీసీ రోడ్డు వేశారంటూ ఎస్సీ కాలనీకి చెందిన కొల్లారప్ప జేసీబీతో సుమారు 30 అడుగుల రోడ్డును ధ్వంసం చేశాడు. పంచాయతీ రాజ్ ఇంజినీర్ల అనుమతి ఇచ్చారంటూ పత్రాలను గ్రామస్తులకు చూపించాడు. అయితే అతడి భూమి సర్వే నెంబర్, రోడ్డు వేసిన సర్వే నెంబర్ వేర్వేరుగా ఉండటంతో బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పీఆర్ జేఈ మునిస్వామిని సంప్రదించగా.. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడానికి అనుమతులు ఇచ్చారని చెప్పడం అబద్ధమన్నారు. ఒకవేళ అతడి స్థలంలో రోడ్డు వేసి ఉంటే పరిహారం ఇప్పిస్తామని తెలిపారు.

ఈశ్వరుడిని పూజించాలి

కణేకల్లు: ఈశ్వరుడిని ఆరాధిస్తూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంచుకోవాలని రాయదుర్గం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయ సంచాలకులు యోగేశ్వరీ, కణేకల్లు సంచాలకులు రాధ పేర్కొన్నారు. కణేకల్లులో బుధవారం శివరాత్రి వేడుకలను పురస్కరించుకొని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంశాంతి జెండాను ఆవిష్కరించారు. శివుడు అజ్ఞానంలోఉండే మానవులను జ్ఞానమనే ప్రకాశంలోకి తీసుకెళుతారని దీనికి గుర్తుగా శివరాత్రి వేడుకలను నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. అనంతరం శివలింగాన్ని పురవీధుల్లో ఊరేగించారు.